క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

ఖానాపురం : మండలంలోని మోడల్‌స్కూల్‌లో ప్రవేశాల కోసం విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్‌ దామెర రాజేందర్‌ తెలిపారు. ఈ సందర్భంగా శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 6, 7, 8, 9, 10 తరగతుల్లో ఖాళీ సీట్ల భర్తీకి నిర్వహించే ప్రవేశ పరీక్ష కోసం విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హులైన విద్యార్థులు ఫిబ్రవరి 15లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఎంపికైన వారి జాబితాను మే 15న వెల్లడిస్తారని ఆయన తెలిపారు.

చర్య తీసుకోవాలి

పర్వతగిరి : అధికారుల నిర్లక్ష్యంతో ప్రజాప్రతినిధులు అక్రమ మొరం, మట్టిదందా చేస్తున్నారని, దాని వల్ల రోడ్లన్నీ ధ్వంసమవుతున్నాయని కిసాన్‌ కాంగ్రెస్‌ సెల్‌ జిల్లా అధ్యక్షుడు బొంపెల్లి దేవేందర్‌రావు అన్నారు. ఈ మేరకు అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించాలని శనివారం ఓ ప్రకటనలో ఆయన పేర్కొన్నారు. లక్షల రూపాయలు ప్రభుత్వానికి చెల్లించి కోట్ల రూపాయల రోడ్లను ధ్వంసమవడానికి కారకులైన వారిని గుర్తించి వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు.

అభివృద్ధికి సహకరించాలి



నెక్కొండ : స్థానిక అభయాంజనేయ స్వామి ఆలయ అభివృద్ధికి గ్రామస్తులు సహకరించాలని సర్పంచ్‌ సొంటిరెడ్డి యమునారెడ్డి కోరారు. జీపీ కార్యాలయంలో గ్రామస్తులు, కుల సంఘాల పెద్దలతో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గతేడాది జూన్‌ 9, 10, 11తేదీలలో బొడ్రాయి పునఃప్రతిష్ఠాపన కార్యక్రమాలకు సంబంధించిన ఖర్చుల వివరాలను ఆమె వివరించారు. ఇంకా మిగులుగా సుమారు రూ. 6లక్షల నిధులు ఉన్నాయన్నారు. అభయాంజనేయ స్వామి ఆలయ అభివృద్ధి కోసం ఈ నిధుల్ని వెచ్చించనున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఈ సమావేశంలో వివిధ కులాల పెద్దలు, రాజకీయ పార్టీ నాయకులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు ధ్వజస్తంభ ప్రతిష్ఠ

పర్వతగిరి : మండలంలోని అన్నారం గ్రామంలో గల రామలింగేశ్వరస్వామి ఆలయంలో నేడు(ఆదివారం) ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ మేరకు బీఆర్‌ఎస్‌ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్‌కు ఆలయ కమిటీ బాధ్యులు శనివారం ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి రావాలని ఆహ్వాన పత్రికను అందజేశారు. కార్యక్రమంలో బాబు, జడల కృష్ణ, రామసాని కృష్ణ, మహేందర్‌, తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం

రాయపర్తి : మండలంలోని కొత్తూరు ప్రాథమిక పాఠశాలలో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం మండల కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు బత్తిని వెంకటరమణ తెలిపారు. అధ్యక్షుడిగా సామల రమేష్‌, ప్రధానకార్యదర్శిగా మనోజ్‌ కుమార్‌, కార్యదర్శిగా శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులుగా శ్రీనివాస్‌, రాణి, కార్యదర్శిగా శంకర్‌ లింగం, జిల్లా కార్యవర్గ సభ్యులుగా జైపాల్‌ రెడ్డి, రవికుమార్‌, అరవింద్‌, వివి ఆచార్యలను ఎన్నిక చేసినట్లు తెలిపారు.

రెయిన్‌బో కలర్స్‌ డే



నర్సంపేట : పట్టణంలోని అక్షర ద స్కూల్‌, బిట్స్‌ స్కూల్‌లో రెయిన్‌బో కలర్స్‌ డే వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. చిన్నారులు హరివిల్లులోని వివిధ రంగుల దుస్తులతో సీతాకోక చిలుకను తలపించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బాలాజీ విద్యా సంస్థల చైర్మన్‌ డాక్టర్‌ ఏ.రాజేంద్రప్రసాద్‌రెడ్డి, ట్రెజరర్‌ డాక్టర్‌ వనజ హాజరయ్యారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ప్రకృతిలోని హరివిల్లు ఎంతో అందమైందన్నారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ రాజేశ్వర్‌రెడ్డి, అక్షర స్కూల్‌ ప్రిన్సిపాల్‌ ఆర్‌.జ్యోతి, బాలాజీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌ రామ్‌రాజ్‌, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

క్యాలెండర్‌ ఆవిష్కరణ

రాయపర్తి : హ్యూమన్‌రైట్‌ అడ్వకేసి సొసైటీ క్యాలెండర్‌ను మండల పరిషత్‌ కార్యాలయంలో శనివారం ఆవిష్కరించారు.ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్‌ల ఆధ్వర్యంలో క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.

రోడ్డు నిర్మాణానికి నిధుల మంజూరు సంతోషకరం

దుగ్గొండి : మండలంలోని వెంకటాపురం గ్రామశివారు మంగలితండా వరకు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు కావడంతో ఆ తండా వాసులు శనివారం నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. తండా రోడ్డుకు వెంటనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ధరావత్‌ మున్యానాయక్‌, లింగమూర్తి, రాజు, భాస్కర్‌ పాల్గొన్నారు.

పంచాయతీల్లో డిజిటల్‌ సేవలు

- అక్రమాలకు చెక్‌ పెట్టేలా చర్యలు
- కార్యదర్శులకు తగ్గనున్న పనిభారం
- ఇక ఆన్‌లైన్‌లోనే జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు



రాయపర్తి గ్రామపంచాయతీ కార్యాలయం

రాయపర్తి : శాస్త్ర సాంకేతిక రంగంలో అనేక మార్పులు చోటు చేసుకుంటున్నాయి.. దీంతో ప్రతీ ఒక్కరికి ఆన్‌లైన్‌ సేవలు అరచేతిలో అందుతున్నాయి.. గ్రామపంచాయతీల్లో డిజిటల్‌ సేవలు ఇక సులభతరం కానున్నాయి.. స్థానిక ప్రజలకు అందుబాటులో ఉండేందుకు పారదర్శకతను పాటించేందుకుగాను ప్రభుత్వం ఆన్‌లైన్‌ సేవలను అందించనుంది. ఈ మేరకు అన్ని గ్రామపంచాయతీ కార్యాలయాల్లో కార్యదర్శుల చేతికి డిజిటల్‌ కీ అందిస్తోంది. దీంతో కార్యదర్శులకు పనిభారం తగ్గడంతోపాటు సేవల్లో జాప్యాన్ని నివారించి సత్వరమే సమస్యలు పరిష్కారమయ్యేలా చర్యలు చేపట్టింది. దరఖాస్తుదారులకు సమయం ఆదా అవుతుంది. మొదటగా పంచాయతీల్లో కేవలం జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీకి మాత్రమే డిజిటిల్‌ కీని ప్రభుత్వం ఇటీవల జిల్లాలోని జీపీకార్యదర్శులకు అనుమతులు జారీ చేసింది. ఇక నుంచి అన్ని ధ్రువ పత్రాలు ఆన్‌లైన్‌ ద్వారా జారీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

జనన, మరణ ధ్రువీకరణ పత్రం తప్పనిసరి

పిల్లల చదువుల కోసం జనన ధ్రువీకరణ తప్పనిసరి. పాఠశాలల్లో ప్రవేశాలు, ఉన్నత చదువుల కోసం జనన ధ్రువీకరణ అవసరం. ఉద్యోగులు, ఇన్సూరెన్స్‌ ఉన్నవారు మరణిస్తే బాధితకుటుంబ సభ్యులకు మరణ ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరిగా అవసరం. ఈ నేపథ్యంలో డిజిటల్‌ సేవల ద్వారా త్వరగా పొందవచ్చు. గ్రామాలలో నల్లా, ఇంటి పన్ను, గ్రామసభల నిర్వహణ, హరితహారం, ఈజీఎస్‌ పత్రాల జారీతోపాటు తదితర 34 రకాల పనులు కార్యదర్శులు చేయాల్సి ఉంటుంది. గతం కంటే పంచాయతీ కార్యదర్శులకు పని భారం తగ్గనుంది. త్వరగా పత్రాలను ఇచ్చేందుకు అవకాశం ఉండడంతో డిజిటల్‌ కీ సేవలను అమలు చేస్తోంది.

అక్రమాలకు చెక్‌ పెట్టేలా..

ప్రజలకు అవసరమయ్యే ధ్రువీకరణ పత్రాల జారీలో కొన్ని చోట్ల అక్రమాలు జరుగుతున్నట్లు ఫిర్యాదులు వస్తాయి. కొందరు కార్యదర్శులు సంతకాలను ఫోర్జరీ చేస్తున్నట్లు, తప్పుడు పత్రాలు అందిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో పత్రాలను డిజిటల్‌ కీ విధానంతో ఇవ్వడం ద్వారా అక్రమాలకు చెక్‌ పెట్టినట్లు అవుతుందని పేర్కొంటున్నారు. మీ–సేవ ద్వారా దరఖాస్తు చేసుకున్న ప్రతీ ఒక్కరికి పత్రాలు సిద్ధం కాగానే తమ సెల్‌ఫోన్‌లకు మెసేజ్‌ వచ్చేలా ఏర్పాట్లు చేశారు. ఈ సేవలను రాష్ట్రంలో ఎక్కడి నుంచైనా పొందేందుకు వీలుండడంతో ఖర్చులు తగ్గడంతోపాటు సమయం ఆదా అవుతుంది.

మార్గదర్శకాలు అందాయి



డిజిటల్‌ కీ సేవలు అందించేలా ఉన్నతాధికారుల నుంచి మాకు ఆదేశాలు వచ్చాయి. ప్రజలకు అందుబాటులో ఉండేలా డిజిటల్‌ సిస్టం ఉంది. ఎలాంటి అవకతవకలు జరగకుండా చర్యలు చేపట్టేలా ఉంది. సమయం ఆదా అవుతుంది.

–గుగులోత్‌ అశోక్‌నాయక్‌, పంచాయతీకార్యదర్శి, రాయపర్తి

ఆన్‌లైన్‌లో ఇచ్చేలా చర్యలు



జనన, మరణ ధ్రువీకరణ పత్రాలతోపాటు ఇతర సేవలు ఆన్‌లైన్‌ ద్వారా అందించేలా డిజిటల్‌ కీ అందించాం. దీంతో ఎలాంటి అక్రమాలకు తావు లేకుండా ఉంటుంది. డిజిటల్‌ సంతకంతోనే పత్రాలను జారీ చేయాల్సి ఉంటుంది. ప్రజలు సులువుగా సేవలను పొందవచ్చు. ఎలాంటి అవకతవకలు లేకుండా చర్యలు తప్పులు దొర్లే అవకాశం ఉండదు.

–జి.కిషన్‌, ఎంపీడీఓ రాయపర్తి

కేసీఆర్‌తోనే తండాల అభివృద్ధి



సంగెం: పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ



నర్సంపేట రూరల్‌: ముగ్ధుంపురంలో..

సంగెం : తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత సీఎం కేసీఆర్‌ తండాలను అభివృద్ధి చేశారని ఎంపీపీ కళావతి, జెడ్పీటీసీ సుదర్శన్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని ఎల్గూర్‌స్టేషన్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తండాలను పంచాయతీలుగా చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. అలాగే మండలంలోని గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణలకు పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి రూ.11 కోట్లు మంజూరు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌ మోహన్‌, ఎంపీటీసీ పద్మశ్రీనివాస్‌ తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

నర్సంపేట రూరల్‌ : నర్సంపేట మండలంలోని ముగ్ధుంపురంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం నిధులతో మంజూరైన సీసీరోడ్డు నిర్మాణ పనులను జెడ్పీటీసీ కోమాండ్ల జయగోపాల్‌రెడ్డి, ఎంపీపీ మోతె కళావతి శనివారం ప్రారంభించారు. అదేవిధంగా గురిజాల గ్రామ శివారులోని మహబూబాబాద్‌పల్లిలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఎంపీటీసీ బండారి శ్రీలత ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌ పార్టీ మండల అధ్యక్షుడు నామాల సత్యనారాయణ, ఉపసర్పంచ్‌ ఇస్లావత్‌ రాజన్న, వార్డు సభ్యులు పెండ్యాల సదానందం, పంచాయతీ కార్యదర్శి షేక్‌ రహీం పాషా, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం



ఖానాపురం : మండలంలోని రాగంపేట గ్రామానికి చెందిన రాజు అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో నర్సంపేటకు చెందిన నర్సంపేట మొబైల్స్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో శనివారం పరామర్శించారు. అనంతరం రూ.11వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో దుబ్బాక నర్సింహారెడ్డి, కన్నెబోయిన యాకాంబ్రం, బల్లు వేణు, శోభన్‌బాబు, జగదీశ్వర్‌, రామ్‌రాజ్‌, ప్రవీణ్‌, తదితరులు పాల్గొన్నారు.

దుగ్గొండిలో..



దుగ్గొండి : మండలంలోని నాచినపల్లి గ్రామానికి చెందిన రూపిక కనకమ్మ(80) శనివారం మృతి చెందింది. ఈమేరకు మృతురాలి అనాథ కావడంతో దహన సంస్కారాలకు ముదిరాజ్‌ సంఘం నర్సంపేట డివిజన్‌ నాయకుడు ఓరుగంటి అశోక్‌ ఆర్థికసాయంతో పాటు బియ్యం అందించారు.కార్యక్రమంలో రూపిక శ్రీనివాస్‌, దేవేందర్‌, రాకేష్‌, మణి, గోవర్ధన్‌ పాల్గొన్నారు.

మట్టి తవ్వకాలకు అనుమతి ఇవ్వొద్దు



వినతిపత్రం అందిస్తున్న సర్పంచ్‌, వార్డు సభ్యులు

సంగెం : ఫుడ్‌ ప్రాసెసింగ్‌ యూనిట్‌ ప్రతిపాదిత స్థలంలో ప్రైవేట్‌ వ్యక్తులకు మట్టితవ్వకాలకు అనుమతి ఇవ్వొద్దని జీపీ పాలకవర్గం సభ్యులు ఇన్‌చార్జ్‌ తహసీల్దార్‌ రాజేశ్వర్‌రావుకు శనివారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మండలంలోని నర్సానగర్‌ సర్పంచ్‌ జాటోత్‌ చత్రునాయక్‌ పాలకవర్గం సభ్యులతో కలిసి మాట్లాడుతూ ఎల్గూర్‌స్టేషన్‌ రెవెన్యూ పరిధిలోని 648 సర్వే నంబర్‌లో ఫుడ్‌ ప్రాసెసింగ్‌ యూనిట్‌ నెలకొల్పేందుకు గతంలో కలెక్టర్‌, అదనపు కలెక్టర్‌ ఇతర ఉన్నతాధికారులు సందర్శించి ప్రతిపాదనలు చేశారన్నారు. అలాంటి ప్రభుత్వ భూమిలో అశ్వద్దామ ప్రైవేట్‌ వెంచర్‌ మట్టి తవ్వకాలు చేస్తే గుంతలుపడి యూనిట్‌ ఎలా నెలకొల్పుతారని ప్రశ్నించారు. అధికారులు మట్టి తవ్వకాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు జాటోత్‌ రాజేష్‌, భాను, బాలాజీ, చందు, రాంమూర్తి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



నర్సంపేట రూరల్‌ : శివకోటి భార్య కల్యాణి, కుటుంబసభ్యులను ఓదార్చుతున్న పెద్ది స్వప్న

నర్సంపేట రూరల్‌ : పట్టణానికి చెందిన శివకోటి, కల్యాణ్‌ ఇద్దరు రోడ్డు ప్రమాదంతో మృతిచెందడంతో నర్సంపేట డివిజన్‌ ఫొటో, వీడియోగ్రాఫర్ల ఆధ్వర్యంలో వారి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నర్సంపేట పట్టణంలోని అమరవీరుల స్థూపం నుంచి బస్టాండ్‌, అంగడి సెంటర్‌, అంబేడ్కర్‌, పాకాల రోడ్డు నుంచి బైక్‌ ర్యాలీని నిర్వహించారు. అనంతరం మృతదేహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జెడ్పీ ఫ్లోర్‌ లీడర్‌ పెద్ది స్వప్న, మున్సిపల్‌ చైర్‌ పర్సన్‌ గుంటి రజని, కౌన్సిలర్లు, బీజేపీ, టీఆర్‌ఎస్‌, కాంగ్రెస్‌, నాయకులు, వైఎస్సార్‌టీపీ జిల్లా అధ్యక్షుడు నాడెం శాంతికుమార్‌తో పాటు పలువురు నేతలు మృతదేహాలపై పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఫొటోగ్రాఫర్ల సంఘం నాయకులు మండ కార్తీక్‌, బండారు సురేష్‌, మురళి, సంతోష్‌, నరేష్‌, అమరేందర్‌, శ్రీనివాస్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

నర్సంపేట రూరల్‌ మండలంలోని మాధన్నపేట గ్రామానికి చెందిన గ్రామపంచాయతీ మల్టీపర్పస్‌ వర్కర్‌ సుంచ రాములు అనారోగ్యంతో బాధపడుతూ శనివారం మృతిచెందాడు. ఆయన మృతదేహంపై నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌ రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట సర్పంచ్‌ మొల్గూరి చంద్రమౌళి, నాయకులు పెసరు శ్యాంరాజ్‌, తడిగొప్పుల మల్లేష్‌, తదితరులు పాల్గొన్నారు.

పర్వతగిరిలో బీఆర్‌ఎస్‌ నాయకులు..

పర్వతగిరి : మండలంలోని రోళ్లకల్‌ గ్రామానికి చెందిన లూనావత్‌ సోమ్లానాయక్‌ ఇటీవల మృతి చెందాడు. కాగా బాధిత కుటుంబసభ్యులను ఏఎంసీ డైరెక్టర్‌ పట్టాపురం ఏకాంతంగౌడ్‌, బీఆర్‌ఎస్‌ పార్టీ మండల అధ్యక్షుడు రంగు కుమార్‌గౌడ్‌ శనివారం పరామర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వల్లందాస్‌ వెంకటేశ్వర్లు, బూర శ్యామ్‌గౌడ్‌, జంగిల్‌ యాకయ్య, రోళ్లకల్‌ గ్రామ పార్టీ అధ్యక్షుడు జనగాం శ్రీనివాస్‌గౌడ్‌, గ్రామస్తులు పాల్గొన్నారు.

బాధితులకు పెద్ది స్వప్న భరోసా

చెన్నారావుపేట : మండలంలోని అక్కల్‌చెడ శివారు హరియతండాకు చెందిన లావుడ్యా దేవ్‌సింగ్‌ పూరి గుడిసె ఇటీవల దగ్ధమైంది. కాగా జెడ్పీ ఫ్లోర్‌ లీడర్‌ పెద్ది స్వప్న శనివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి భరోసా కల్పించారు. రూ.10వేల ఆర్థిక సాయంతో పాటు డబుల్‌ బెడ్రూం ఇల్లు నిర్మాణంలో మొదటి ప్రాధాన్యత ఇవ్వడానికి ఎమ్మెల్యే హామీ ఇచ్చారని ఆమె తెలిపారు. ఆర్‌బీఎస్‌ జిల్లా డైరెక్టర్‌ తూటి శ్రీనివాస్‌ క్వింటా బియ్యం అందజేశారు. అలాగే బాధిత కుటుంబానికి మండల యువనాయకుడు కంది కృష్ణచైతన్య రెండు ట్రాక్టర్ల ఇటుకను సాయం చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పత్తినాయక్‌, సర్పంచ్‌ కుండె మల్లయ్య, రఫీ, ఎం ఏ.గఫార్‌, తూటి శ్రీనివాస్‌, రాంరెడ్డి, నర్సింగరావు, శ్రీధర్‌రెడ్డి, ఉపేందర్‌, కిషన్‌, రమేష్‌, మల్లయ్యతో పాటు తదితరులు ఉన్నారు.

ఉచిత విద్యుత్‌ అందించడంలో విఫలం



రాస్తారోకో చేస్తున్న కాంగ్రెస్‌ నాయకులు

నల్లబెల్లి : రైతులకు నాణ్యమైన 24గంటల ఉచిత విద్యుత్‌ అందించడంలో బీఆర్‌ఎస్‌ పార్టీ పూర్తిగా విఫలమైయిందని కాంగ్రెస్‌ పార్టీ మండల అధ్యక్షుడు చిట్యాల తిరుపతి రెడ్డి అన్నారు. విద్యుత్‌ కోతలను నిరసిస్తూ కాంగ్రెస్‌ పార్టీ ఆధ్వర్యంలో మండలంలోని శనిగరం శివారులోని జాతీయ రహదారిపై శనివారం రాస్తారోకో చేశారు. దీంతో రాహదారిపై వాహనాలు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. ఈ సందర్భంగా తిరుపతిరెడ్డి మాట్లాడుతూ వ్యవసాయానికి 24గంటల ఉచిత విద్యుత్‌ అందిస్తామని రెండోసారి అధికారంలోకి వచ్చిన సీఎం కేసీఆర్‌ ఎన్నికల హామీలను విస్మరిస్తూ రైతులను మోసగిస్తున్నారని విమర్శించారు. విద్యుత్‌ కోతలతో రైతుల పంటలు ఎండిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్‌ అందేలా ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌ పార్టీ మండల వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ వైనాల అశోక్‌, నాయకులు ఇస్తారి శేఖర్‌ గౌడ్‌, పురుషోత్తం సురేష్‌, పెంతల కొంరారెడ్డి, జెట్టి రాంమూర్తి, చిట్యాల ఉపేందర్‌ రెడ్డి, బేతి భరత్‌, బత్తిని మల్లయ్య, మాసనపెల్లి ప్రభాకర్‌ పాల్గొన్నారు.

క్రీడోత్సవాల నిర్వహణ హర్షణీయం



చెన్నారావుపేట: క్రీడలను ప్రారంభిస్తున్న బాధ్యులు



గీసుకొండ: గంగదేవిపల్లిలో క్రీడాకారులతో సర్పంచ్‌ మల్లారెడ్డి, హెచ్‌ఎం

చెన్నారావుపేట : గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని ఉప్పరపల్లి ఉన్నత పాఠశాలలో క్రీడలను సర్పంచ్‌ పెరుమాండ్ల శ్రీధర్‌రెడ్డి, ఎంపీటీసీ చెరుకుపల్లి విజేందర్‌ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు ఫ్లోరెన్స్‌ శనివారం ప్రారంభించారు. 1997–98 బ్యాచ్‌ 10వ తరగతి పూర్వ విద్యార్థులు 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా క్రీడోత్సవాలకు బహుమతులను అందిస్తున్నారని అన్నారు. కబడ్డీ, ఖోఖో, క్రికెట్‌, అథ్లెటిక్స్‌ విభాగాలలో రూ.10 వేల విలువైన 250 బహుమతులను ఇవ్వడం అభినందనీయమన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోను ప్రతిభ చూపాలని సూచించారు. క్రీడోత్సవాల నిర్వహణకు చొరవ చూపడం హర్షనీయమని, పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో చెన్నారావుపేట సొసైటీ వైస్‌ చైర్మన్‌ చింతకింది వంశీ, ఎస్‌ఎంసీ చైర్మన్‌ కాసాని రవి, ఉపాధ్యాయులు జె.ఉమారాణి, పి.రమణ రావు, జి.శ్రీనివాస్‌, కె.సంతోష్‌ కుమార్‌, పి.బాలాజీ రావు, ఎ.ఉదయ్‌ కుమార్‌, సీహెచ్‌.మాధవి, వి.మమత, రవికుమార్‌, కె.మాధవి, సుందర్‌, మురళి, రవీందర్‌, కృష్ణ, మోహన్‌ రావు, ఇందిర, జాహెద్‌, నీల పాల్గొన్నారు.

స్మారక ఆటల పోటీలు

గీసుకొండ : మండలంలోని గంగదేవిపల్లికి చెందిన న్యాల నవీన్‌ స్మారకార్థం జెడ్పీ పాఠశాల విద్యార్థులకు శనివారం ఆటల పోటీలు నిర్వహించారు. క్రికెట్‌, కబడ్డీ తదితర పోటీను నిర్వహించగా సర్పంచ్‌ గోనె మల్లారెడ్డి విజేతలకు బహుమతులను అందిస్తానని ప్రకటించారు. న్యాల రాజు, హెచ్‌ఎం జ్యోతిర్మయి పాల్గొన్నారు.

పార్టీ పటిష్టతలో కమిటీల పాత్ర కీలకం



సమావేశంలో మాట్లాడుతున్న రామానంద్‌

నర్సంపేట : కాంగ్రెస్‌ పార్టీ అభివృద్ధిలో కమిటీల పాత్ర కీలకమని పీసీసీ సభ్యుడు పెండెం రామానంద్‌, మాజీ ఎంపీపీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు, మున్సిపల్‌ ఫ్లోర్‌ లీడర్‌ వేముల సాంబయ్యగౌడ్‌, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు ఓర్సు తిరుపతి అన్నారు. ఈ మేరకు పట్టణ అధ్యక్షుడు బత్తిని రాజేందర్‌, గంధం నరేందర్‌ల ఆధ్వర్యంలో శనివారం 6, 7, 9, 11డివిజన్‌ల కార్యకర్తల సమావేశం నిర్వహించి కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చరిత్ర గల కాంగ్రెస్‌ పార్టీని ప్రజల నుంచి దూరం చేయడం ఎవరితరం కాదన్నారు. బీఆర్‌ఎస్‌, బీజేపీ పాలనలో ఏ ఒక్కవర్గం కూడా సుఖంగా లేరని, శాశ్వత అభివృద్ధికి దోహదపడే పథకాలు కాకుండా ప్రచార ఆర్భాట పథకాలను అమలు చేస్తూ ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. కమిటీలలో ఎన్నుకోబడిన వారి పనితీరుపైనే పార్టీ పటిష్టత ఆధారపడి ఉందన్నారు. అనంతరం డివిజన్‌ కమిటీలను ఎన్నుకున్నారు.

6వ డివిజన్‌ కమిటీ గౌరవ అధ్యక్షుడిగా మోతె చిన్నసంపత్‌రెడ్డి, అధ్యక్షుడిగా మనుగొండ రాజేష్‌, ఉపాధ్యక్షుడిగా కటంగూరి మనోహర్‌, ప్రధాన కార్యదర్శిగా ఓరగంటి నాగరాజు, సహాయ కార్యదర్శిగా కొయ్యడి రాజ్‌కుమార్‌, కోశాధికారిగా గట్ల రజని ఎన్నికయ్యారు. అలాగే 7వ డివిజన్‌ అధ్యక్షుడిగా చిగురు కమలాకర్‌, ఉపాధ్యక్షులుగా గాదుదుల అశోక్‌, కాలె రవి, ప్రధాన కార్యదర్శిగా బండారి ఎల్లయ్య, సహాయ కార్యదర్శిగా సల్లా మనోహర్‌, కోశాధికారిగా దేవులపల్లి అశోక్‌లను నియమించారు. 9వ డివిజన్‌ అధ్యక్షుడిగా పిన్నింటి కిరణ్‌కుమార్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా కొంతం సదానందం, బల్ల కుమార్‌, ప్రధాన కార్యదర్శిగా మత్తోజు రవిరాజ్‌చారి, బైరబోయిన శ్రీనివాస్‌, 11వ డివిజన్‌ అధ్యక్షుడిగా వడ్డే కుమారస్వామి, ఉపాధ్యక్షుడిగా వనపర్తి రాజేష్‌, ప్రధాన కార్యదర్శిగా జూలపల్లి రాజేశ్వర్‌రావు, సహాయ కార్యదర్శిగా నీరటి రంజిత్‌, కోశాధికారిగా వడ్డె సదానందం, అనిశెట్టి జీవన్‌లు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్‌ ఎంపీపీ చింతల సాంబరెడ్డి, మాజీ వార్డు మెంబర్‌ ములుకల సాంబయ్య, మాజీ ఎంపీటీసీ కాట ప్రభాకర్‌, ఓబీసీ సెల్‌ జిల్లా వైస్‌ చైర్మన్‌ మేరుగు సాంబయ్య, నర్సంపేట నియోజకవర్గ యువజన కాంగ్రెస్‌ ప్రధాన కార్యదర్శి తుమ్మలపల్లి సందీప్‌, ఓబీసీ పట్టణ అధ్యక్షుడు పోతారుబోయిన చంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి



చెన్నారావుపేట: విద్యార్థులకు నోట్‌ బుక్స్‌, పెన్నులు పంపిణీ చేస్తున్న మోడల్‌ స్కూల్‌ ఉపాధ్యాయుడు



పర్వతగిరిలో..



నల్లబెల్లి: విద్యార్థులకు బుక్స్‌ అందిస్తున్న కవిత

నల్లబెల్లి : ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జేడీ ఫౌండేషన్‌ తెలంగాణ ఇన్‌చార్జ్‌ కవిత అన్నారు. జేడీ ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో మండలంలోని మేడపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు అవసరమైన ఆటవస్తువులు, గ్రంథాలయానికి స్టోరీ బుక్స్‌ అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ.. పాఠశాలకు భవిష్యత్‌లో జేడీ ఫౌండేషన్‌ నుంచి మరింత సహాయ, సహకారాలు అందిస్తామని తెలిపారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థులు కవితను అభినందిస్తూ సన్మానించారు. హెచ్‌ఎం కృష్ణమూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి

పర్వతగిరి : పదో తరగతి విద్యార్థులు కష్టపడి చదివి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని హెచ్‌ఎం హైమావతి అన్నారు. ఈ మేరకు మండలంలోని ఏనుగల్‌ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు అదే పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న రోటరీ క్లబ్‌ వరంగల్‌ అధ్యక్షుడు దీకొండ నర్సింహారావు ఆధ్వర్యంలో శనివారం హెచ్‌ఎం హైమావతి ఆల్‌ ఇన్‌ వన్‌ పుస్తకాలను పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు కల్లూరి వెంకటేశ్వర్లు, సదయ్య, పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు భూక్యా రాములు, భారతి, కుమారస్వామి, ఆకుల అశోక్‌ పాల్గొన్నారు.

చెన్నారావుపేట : మండలంలోని అమీనాబాద్‌ గ్రామంలో గల మోడల్‌ స్కూల్‌ విద్యార్థులకు అదే పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న భూమ రాజేందర్‌ నోట్‌ బుక్స్‌, పెన్నులు, ఇతర సామగ్రి పంపిణీ చేశారు. శనివారం అతని తల్లిదండ్రులు భూమ మల్లికాంబ–సారయ్యల జ్ఞాపకార్థం విద్యార్థులకు పంపిణీ చేసినట్లు తెలిపారు. విద్యార్థులు చదువుల్లో రాణించాలని ఆయన సూచించారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

వర్ధన్నపేట : మండలంలోని కట్ర్యాల గ్రామానికి చెందిన చెవల్ల రాజు(40) చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఎస్సై రామారావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల వద్ద చెవల్ల రాజు తన సమీప బంధువు చెవల్ల సాంబరాజుతో మాట్లాడుకుంటూ శుక్రవారం ఘర్షణకు దిగాడు. ఈ ఘర్షణలో చెవల్ల రాజు కింద పడడంతో తలకు బలమైన గాయమైంది. వెంటనే స్థానికులు వరంగల్‌ ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడికి భార్య యాకలక్ష్మి, ఇద్దరు కూతుర్లు, ఒక కుమారుడు ఉన్నారు. యాకలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రామారావు తెలిపారు. ఈ క్రమంలో శనివారం రాజు మృతదేహాన్ని తీసుకు వచ్చి సాంబరాజు ఇంటి ఎదుట పెట్టి తమకు న్యాయం చేయాలని ఆందోళన చేశారు. ఈ సమాచారం అందుకున్న పోలీసులు బాధితులకు న్యాయం చేస్తామని మృతదేహాన్ని తరలించాలని చెప్పడంతో చివరికి అంత్యక్రియలు నిర్వహించారు.